# స్థిరమైన ప్రభుత్వం దృఢమైన నాయకత్వం

- బీఆర్ఎస్‌తోనే విశ్వనగరపు అడుగులు
- కాంగ్రెస్ అంటేనే కర్ఫ్యూలు..
- బీజేపీ అంటే మతకల్లోలాలు
- పొలిటికల్ టూరిస్టులను ప్రశ్నించండి
- నగరాన్ని విచ్ఛిన్నం చేసే పార్టీలను తరిమికొట్టండి
- ప్రగతి కావాలంటే మళ్లీ బీఆర్ఎస్‌నే ఆశీర్వదించండి
- గ్రేటర్‌లో గులాబీ రెపరెపలు.. హ్యాట్రిక్ విజయం ఖాయం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అంటేనే కర్ఫ్యూ, బీజేపీ మతకల్లోల పార్టీ .. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ నగరాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటున్న ఈ రెండు పార్టీలను తరిమికొట్టాలని నగర మంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నరేండ్లలో కులాల పంచాయితీ పెట్టకుండా, మతం పేరిట మంటలు పెట్టకుండా.. ప్రాంతాల పేరుతో ఇబ్బందులు పెట్టకుండా బ్రహ్మాండంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా రూపుదిద్దడంలో ఒక్కొక్క అడుగు వేస్తూ పని చేస్తున్నామని చెప్పారు. మా ప్రభుత్వ పాలన ప్రజల కండ్ల ముందు ఉన్నదని, గత ప్రభుత్వాల పనితీరు కూడా గుర్తుంచుకుని ప్రజలు ఓటు వేయాలని కోరుతున్నామన్నారు. ఎన్నికలు రాగానే అబద్ధాలతో ప్రజలను గందరగోళంలోకి నెట్టేయడం, గొప్ప పాలనను అందిస్తున్న సీఎం కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న పార్టీలు, ముఖ్యంగా హైదరాబాద్‌కి వచ్చే పొలిటికల్ టూరిస్ట్‌లు రాష్ట్రానికి, హైదరాబాద్‌కు ఏం చేశారో చెప్పి రావాలని తలసాని ప్రశ్నించారు. హైదరాబాద్‌కి వచ్చే ప్రధాని మోదీకి ఈ తొమ్మిదిన్నరేండ్లలో ఏం చేశారో చెప్పాలని తలసాని డిమాండ్ చేశారు. మేం 36 ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు పూర్తి చేస్తే రెండు ఫ్లై ఓవర్లు అంబర్‌పేట, ఉప్పల్‌లో ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పే ధైర్యం ఉందా? అని పేర్కొన్నారు. గ్యారంటీ లేని వాళ్లు గ్యారంటీ అంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీలకు గ్యారంటీ లేకనే ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లిఖార్జున ఖర్గేను పెట్టారన్నారు. సీఎం కుర్చీ, పదవుల కోసం ఆరాటపడే కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని చెప్పారు. స్థిరమైన ప్రభుత్వం, దృఢమైన నాయకత్వంతో రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని తలసాని అన్నారు. తెలంగాణలో ఉన్న గుడ్ గవర్నెన్స్ భారతదేశంలో ఎక్కడా లేదని, ఈ మంచి ప్రభుత్వాన్ని కాదని దొంగలకు తాళం చేతులు ఇస్తే ఇప్పుడున్న రాష్ట్రం సర్వనాశనం అవుతుందని, ప్రజలు విజ్ఞులు అని చెప్పారు. అభివృద్ధి, నిరంతరం పనితీరు కనబర్చాలన్నా బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నట్లు తలసాని తెలిపారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం జరుగుతున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, హైదరాబాద్‌కు వస్తున్న ప్రముఖులు, ఇతర అంశాలపై గురువారం మంత్రి తలసాని మాట్లాడారు.

**ఎవరూ ఊహించని అభివృద్ధి..**

50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో జరిగింది. ఒక్క సనత్‌నగర్‌లో ఎవరూ ఊహించని స్థాయిలో 1400 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఎంతో అస్తవ్యస్తంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాం. నిరంతర విద్యుత్, సమృద్ధిగా తాగునీరు, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, ఎల్ఈడీ, డ్రైనేజీ వ్యవస్థ, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్, ఆధునిక మార్కెట్లు ఇలా చాలా అభివృద్ధి పనులు జరిగాయి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మున్ముందు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు.

**ప్రజలకు విశ్వాసం ఉంది**

గ్రేటర్‌లో నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ మానస పుత్రిక డబుల్ బెడ్రూం ఇండ్ల పథకం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కార్పొరేట్ స్థాయిలో లక్ష రెండు పడకల గదుల ఇండ్లను నిర్మించాం. ఇందులో 70వేల మంది లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేశాం. మరో 30 వేల ఇండ్ల పంపిణీ చేయాల్సి ఉండగా.. ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిపోయింది. డబుల్ బెడ్‌రూం ఇండ్లు వచ్చిన వాళ్లు సంతోషంగా ఉన్నారు.. రానివారికి వస్తాయనే ధైర్యం ఇస్తున్నాం.. పేదలందరికీ న్యాయం జరిగేలా మరో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాం. దళితబంధు, మైనార్టీ, బీసీ బంధు తదితర పథకాలు దశలవారీగా ఇచ్చేవి.. ప్రజలు కూడా మాపై ఇదే స్థాయిలో విశ్వాసాన్ని పెట్టుకున్నారు. అయితే విపక్ష పార్టీలకు మాట్లాడేందుకు ఏం దొరకడం లేదు..కండ్ల ముందు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కనబడుతున్నా వారు విచిత్రంగా మాట్లాడుతున్నారు. గతంలో ఇందిరమ్మ, జవహర్ హౌసింగ్ లాంటి ఇండ్లు 70 శాతం లబ్ధిదారులు, 30 శాతం సబ్సిడీ పేరుతో పేదలకు కేటాయించారు. అదో పుల్లల డప్పు మాదిరిగా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇండ్లు ఇచ్చారు. కానీ మేం మాత్రం రూ. కోటి విలువజేసే ఇంటిని ఉచితంగా ఇచ్చాం. నెక్లెస్‌రోడ్ అంబేద్కర్ నగర్‌లో ఇచ్చిన ఇంటి విలువ కోటి రూపాయలు, మారేడ్‌పల్లిలో రూ.80 లక్షలు, కొల్లూరు కోటి రూపాయలు.. ఇలా విలువైన ఆస్తిని పేదలకు ఇచ్చాం. 58, 59 జీవోల కింద నా ఇల్లు అనే భరోసా కల్పించాం. మా పథకాలపై అవగాహన లేకుండా మాట్లాడే విపక్ష పార్టీల మూర్ఖులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. వారు ఓటుతోనే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

**భారీ మెజార్టీతో గెలుస్తున్నాం..**

బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి బ్రహ్మాండమైన స్పందన వస్తోంది. తొమ్మిదిన్నరేండ్ల పాలన ప్రజల ముందు ఉంది.. కండ్ల ముందు అభివృద్ధి, ఇంటి ముందు అభ్యర్థి అంటూ చేస్తున్న ప్రచారానికి జనం నీరాజనం పలుకుతున్నారు. అన్ని వర్గాల మద్దతు లభిస్తున్నది. కాలనీలు, అసోసియేషన్లు, అభిమానులు స్వచ్ఛందంగా మా తరపున ప్రచారం నిర్వహిస్తున్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే రూ.400లకు వంట గ్యాస్ సిలిండర్, రేషన్‌పై సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలతో పాటు పేదల కోసం మరో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి పేదలకు పంపిణీ చేస్తామని చెబుతున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ వస్తది.. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమంటూ ప్రజలు విశ్వాసం పెట్టుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవబోతున్నాం. ముఖ్యంగా నేను నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తిని. ఏ చిన్న , పెద్ద సమస్య అయినా రెస్పాన్స్ అవుతా. అర్ధరాత్రి అయినా నా డోర్స్ ఓపెన్‌గా ఉంటాయి..శ్రీనన్నను కలిస్తే భరోసా దక్కుతుంది అనుకుంటున్నారు. అందుకే ఫ్యామిలీలో ఒకడిగా చూసుకుంటూ నా తరపున ప్రచారం చేస్తున్నారు. అద్భుతమైన మెజార్టీతో సనత్‌నగర్‌లో హ్యాట్రిక్ సాధించబోతున్నా.



భోలక్‌పూర్‌లో మంత్రి తలసానికి మంగళహారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

### రాష్ట్రానికి సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష

విజనరీ లీడర్ కేసీఆర్. ఈ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ శ్రీరామరక్ష. ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రి కావడం ప్రజల అదృష్టం. రాష్ట్రం సిద్ధించకముందు ఏ వర్గాలు ఎలా ఉన్నారు? యువత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాలను రంగరించి వారికి కావాల్సిన వసతుల కల్పనపై అధ్యయనం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల ఉద్యమ ట్యాగ్‌లైన్‌తో ఏర్పడిన తెలంగాణలో మానవ సమాజం బతకాలంటే కరెంట్, సాగు, తాగునీటిని బాగు చేసుకున్నాం. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ నూతన సచివాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహం, జిల్లాకో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, మెడికల్ కాలేజీలు ఇలా రాష్ట్ర అభివృద్ధికి గీటురాయిగా చెప్పొచ్చు. దేశంలో గొప్ప పాలన అందించిన ప్రభుత్వంపై ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. ప్రజలు బాగుండాలని కోరుకునే ఈ ప్రభుత్వాన్ని దూరం చేసుకునేందుకు సిద్ధంగా లేరు. కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తాం... మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారు.

### ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించండి

ఈ నెల 30వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఆ రోజు హాలీడే ఉందని సినిమాకో, దేవాలయానికో పోతామనే ధోరణిని పక్కన పెట్టండి. ప్రజాస్వామ్య హక్కు.. ఓటు వినియోగం. ఓటు వేసినప్పుడే ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ఉంటది. మనకు నచ్చిన ఎమ్మెల్యేను, ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా.

# తాగు నీరిచ్చిన అపరభగీరథుడు సీఎం కేసీఆర్

- దళిత బంధు ప్రపంచంలో ఎక్కడా లేదు
- మహేశ్వరం ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి




నాగారంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబర్ 16: రాష్ట్రంలో మంచి నీటి దాహాన్ని తీర్చిన అపరభగీరథుడు సీఎం కేసీఆర్ అని, దళిత బంధు ప్రపంచంలో ఎక్కడా లేదని, ఒక్క తెలంగాణలోనే అమలు జరుగుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని నాగారం, నందుపల్లి, తీగలకుంట, ఏనుగు చెరువు తండా, పడమటి తండా, ఏనె మీది తండా, నాగిరెడ్డిపల్లి, హబీబుల్లాగూడ, గొల్లూరు, అమీర్‌పేట, తూప్రఖుర్ధు, పెద్దమ్మ తండ, నల్లచెరువు తండ, మాణిక్యమ్మ గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డితో కలిసి గురువారం నిర్వహించారు. మొదట నాగారం గ్రామంలో అమరుడు సిరిపురం యాదయ్య సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం, మంత్రికి బతుకమ్మలు, మంగళహారతులు, భారీ గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గానికి ఇష్టం లేక వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థిని బీఆర్ఎస్ బలగం నామరూపాలు లేకుండా చేయాలన్నారు. మహేశ్వరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులకు, రియల్ సేవకురాలికి జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో ప్రజలే న్యాయనిర్ణేతలని ఆమె తెలిపారు. ఎల్లప్పుడు ప్రజాసేవ చేస్తున్న నియోజకవర్గం ఆడబిడ్డగా నన్ను దీవించి మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు.

# ప్రభుత్వ పథకాలే గెలుపునకు నాంది

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్
- అడుగడుగునా ప్రజాదరణ

సికింద్రాబాద్, నవంబర్ 16: ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలే తన గెలుపునకు దోహదపడుతాయని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్ డివిజన్‌లో తన ఎన్నికల ప్రచార పాదయాత్ర గురువారం నిర్వహించారు. ముందుగా డివిజన్ పరిధిలోని లలితానగర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి పాదయాత్రను ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ఆయన వెంట నడిచారు. నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, సికింద్రాబాద్ కార్పొరేటర్లు శైలజ, ప్రసన్నలక్ష్మితో పాటు పద్మారావు గౌడ్ తనయులు కిశోర్ గౌడ్, కిరణ్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్‌లు ఎన్నికల ప్రచార పాదయాత్రలో ఉన్నారు. పద్మారావు గౌడ్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మహిళలు మంగళ హారతులు పట్టారు. గులాబీ పూల వర్షం కురిపించారు. కాలనీ వాసులు, వివిధ సంఘాల నాయకులు పద్మారావు గౌడ్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజాదరణ ఉందని, ప్రజల మద్దతు తమ పార్టీకే ఉందని పేర్కొన్నారు. గడప గడపకు వెళ్లి తాము చేసిన అభివృద్ధిని వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకు రాంచందర్, మల్లూరి అనిల్, నవీన్‌చారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధనగర్‌లో కారు గుర్తుకు ఓటేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ప్రచారం